


# నీకూ ఓ కథ వుందోయ్

కొలను వేంకట దుర్గాప్రసాద్

మా పిన్నికూతురు పెళ్ళి సందర్భంగా నేనూ, మా ఆవిడ—మాలతి, ఇద్దరు పిల్లలతో సహా ఉదయం పదిగంటలవేళ బెజవాడలో దిగేం. ఆరోజు రాత్రే పెళ్ళి. పెళ్ళి రోజునే వచ్చినందుకు మా పిన్నీ బాబాయి కలిసి, నామీదా మాలతిమీదా కాసిన్ని అక్షింతలు జల్లేరు.

'సెలవు దొరకలేదు పిన్నీ! కనీసం నిన్నే వద్దాం. కాని ఆ చాకలాడు ఇస్త్రీ బట్టలు తేలేదు. ఇస్త్రీవాడికేసావాయెను. ఈయనేమో ఓ పూట సెలవు చాకల్ని పట్టుకొని బట్టలు ఇస్త్రీ చేయించుకుందుకు ఖర్చు పెట్టారు. అప్పటికి కానీ...'

మాట్లాడుతున్న మాలతిని 'చాల్లేవే, వచ్చేశాం గదా...ఎందుకవన్నీ యిప్పుడు?' కోప్పడ్డాను నెమ్మదిగా.

పిన్నీ బాబాయి, పాపం వాళ్ళు మాత్రం పెళ్ళిపనులు మానుకొని ఎంతసేపని మా మీద అక్షింతలేస్తూ కూర్చుంటారు? వాళ్ళు పనుల్లో మళ్ళా నిమగ్నులయ్యారు.

మా ఆవిడ యిద్దరు పిల్లల్నీ నామీఁ పడేసి, తనూ కొంగూ బొడ్లో దోపుకుని పెళ్ళి హడావుడిచేయడంలో మునిగిపోయింది.

ఇక ఈ పిల్లలు—పెద్దాడికి రెండేళ్ళు. రెండోది చంటిది—పదినెల్లు. ఎప్పుడూ ఏడుస్తుంది, ఏదో స్వష్టంతా ఆగిపోయినట్టు. పెద్దాడు పెద్దకేటు. వాడ్ని ఎత్తుకోనవసరంలేదు. అటూ ఇటూ తిరుగుతాడు. అరుస్తాడు. పాడతాడు. నవ్వుతాడు. దొర్లుతాడు. ఎవరు పిల్చినా వెళ్తాడు. అదో గుణం వాడిది. చంటిది ఈ లోకంలోవచ్చి పదినెల్లు కాలేదు. దానికి కొత్తా పాతా తెలుసు. ఛస్తే కొత్తవాళ్ళదగ్గరి కెళ్లదు. 'దావమ్మా ఎత్తుకుంటా' అని ఎవరేనా అనడం ఆలస్యం కుయ్యిమంటుంది.

పెళ్ళిపందిరి పెద్దదివేశారు. ఎండాకాలం రోజులేమో, ప్రతివారూ పందిరికింద చాప లేసుకొనో, బల్లలేసుకొనో, పడకకుర్చీలేసుకొనో, మడతమంచాలేసుకొనో పడుకున్నారు. నేను ఓచోట కూర్చుని ఒరుగుదామనుకున్నాగానీ పిన్నీ మాసిందంటే 'పడుకోడానికటా వచ్చిందీ ఆయ్?' అంటుందేమోనని భయం.

పెద్దాడు అప్పుడే పందిర్లో తిరగడం మొదలుపెట్టాడు. చంటిది కుయ్యిమంది. కాసేపటికి స్థాయిని పెంచింది. ఆకలేస్తోందిగావుసని 'ఏవే మాల్తీ! ...ఓసారిలారా!' అటేటో హడావుడిగాపోతున్న మా లతి ని పిలిచేను.

'అబ్బ! ఏవిటండి?'

'ఏవిటీ నీ విసుగు? ఇదేడుస్తోంది చూడు!' అన్నాను.

'మీరెందుకూ ఏడుపు మొహం పెడ్తారూ? దాన్నిలా యివ్వండి, ఆకలేస్తోంది గావును' అని తీసుకుంది చంటిదాన్ని;

హమ్మయ్య అనుకున్నాను.

కాసేపు అయింది.

భోజనాలకి లేవండరా అన్నారంతా. పడుకున్నవాళ్ళంతా ఒక్కసారే లేచి కూర్చున్నారు. చాపలూ, మడతమంచాలూ, పడక కుర్చీలూ, బల్లలూ ఖాళీఅయ్యాయి. ఇదే సమయం, ఓ మడతమంచం మీదకెళ్ళి ఒరుగుదామని పరుగెట్టేను.

'ఓరే కామేశం!...' పిన్ని పిల్చింది.

నెత్తిమీద కొట్టినట్టు ఆగిపోయేను.

'కాస్త వడ్డనలో వుండు...'

'చచ్చాం! ఫస్టుక్లాసు ప్రయాణంవల్ల ఒళ్ళంతా వచ్చడయితే, ఇప్పుడు పనెవడు చేస్తాడు, నేచేయను పో' అని అరిచేద్దామనుకున్నా.

'తొరగా రా!' అంటూ నా జవాబు వినే టైంలేకుండా వెళ్లిపోయింది.

ఇక లాభంలేదని చొక్కాచేతులు పైకి మడిచి, ఇంట్లోకెళ్ళి ఫాంటుతీసేసి లుంగీ కట్టుకొని పందిర్లోకి వచ్చేను.

పందిరిలో పాతికమంది ఒకచోట గొడవ పడుతున్నారు.

'ఏవిటీ సంగతి?' అడిగేను.

'పెళ్ళికొడుకు వాళ్ళు భోజనానికి రావన్నారు.'

'ఏం? ఎందుకనిట? వాళ్ళు వేరే వండుకున్నారా?!' అడిగాను అంతా నవ్వారు.

ఎదురుగుండా ఓ యిల్లువుంది. అదే పెళ్ళికొడుకు వాళ్ళ విడిదట.

'పాలు పంపించమన్నారట ఓగంటక్రితం అలాగేనని మనవాళ్ళు అన్నారటగానీ, పంపించనేలేదట.'

'పాలడిగిందెవరు? పెళ్ళికొడుకా?' అడిగేను.

'కాదు, పెళ్ళికొడుకు వదినగారి ఆడబిడ్డ అత్తగారి అక్కయ్య కోడలి కూతురికి పాలు కావాల్సివచ్చినయి...'

'మరి వాళ్ళు అడిగినప్పుడు ఎందుకు పంపించలేదు పాలు?' కోప్పడ్డాను

'నాయనా! లక్షపనులు, వూఁ పంపిస్తాం అని తలూపి వచ్చినవారెవరో ఆపాలు ఇచ్చే బాధ్యత నెత్తినవేసుకుంటే బావుండేది. మరి ఆ మనిషి ఎవరికో చెప్పివుంటాడు... ఆయన మరో మనిషికి చెప్పివుంటాడు... ఎవరని ఎన్నని మాసుకుంటాం.' మా వాళ్ళ తరఫున ఎవరో అన్నారు. ఆర్గనైజేషను బావోలేదనిపించింది.

'అది కాదండీ! వాళ్ళ విషయం కాస్త జాగ్రత్తగా చూసుకోవాలి మరి. ఆడపిల్ల గలవాళ్ళంకదా! ఏదొచ్చినా మనకే యిబ్బంది. ఈ గోజు కెలాగో కళ్ళు మూసుకుంటే రేపెవరి దారిన వాళ్ళుపోతారు' అన్నాను.

'ఏంచెయ్యను, తప్పయిపోయింది, క్షమించండీ అని చెప్పికూడా వచ్చాను వుహూఁ ఆస్సలు వినడంలేదు' మా మావయ్య అన్నాడు.

'నేనోసారి వెళ్లొస్తానాగండి' అంటూ విడిదిలో కెళ్ళాను.

కళ్లకి, కాటుక, బుగ్గన చుక్క పెట్టుకొని పెళ్లికొడుకు కూర్చునివున్నాడు. తిన్నగా అక్కడి కెళ్లేను.

నేను ఫలానా అని చెప్పుకొని 'మీరంతా భోజనానికిరానని అన్నారట. సంగతేవిటో చెప్పండి...ఏదో సర్దుకుంటాం...మా పిన్నీ బాబాయికి పాపం ఈ హడావుడి కొత్త. వాళ్ళింట్లో యిదే మొదటి పెళ్లి. కంగార్లో ఏవో పొరపాట్లు జరుగుతుంటాయి' వసిగాను.

'పొరపాటేవిటండి? చంటిదానికి పాలు అడిగాం. పంపిస్తావన్నారు. చంటిదానికి పోతపాలు అలవాటు. ఇలా మమ్మల్ని పట్టించుకోరని మాకేం తెలుసు? లేకపోతే గేదెను తోలుకొచ్చుకునేవాళం' ఎవరో ముఖ్యే అయిదేళ్లావిడ అరిచింది

'అంతమాట అనకండి. ఇకనుంచి మీకేవి కావాలన్నా నాకు చెప్పండి నే చేస్తాను. నేనిక్కడే వుంటాను, సరేనా? మరిక మీరు భోజనానికి లేవాలి... అక్కడ వంటకాలన్నీ చల్లారిపోతున్నాయి ... రుచి పోతుంది...'

'పాపం లేవండర్రా! ఆయన చూస్తానంటున్నాడుగా...' ఒకాయన అన్నాడు! ఆకలో చస్తున్నాడని పసికట్టేను. గభాల్న ఆయన దగ్గరికెళ్ళి. 'పెద్దవారు, మీరు లేవండి' అని ఆయన్ని లేవదీసాను.

ఆయన భార్యగావును గభాల్నవచ్చి ఆ ముసలాయన భుజంమీద బలంగా చెయ్యేసి లేవనీయకుండా చేసింది 'మళ్ళా చంటిదాని పాలగురించి మర్చిపోయారు? ముందా పాలు తీసుకురండి' అంది.

'ఇప్పుడే పట్టుకొస్తాను' అని అక్కడ్నుంచి పిన్నిదగ్గరికి పరుగెట్టుకొచ్చేను

'కాసిన్ని పాలు... కాసిన్నేం కర్మ... ఓ పెద్దగ్లాసులో పాలుపోసి యివ్వండి. నేను వెళ్ళి యిచ్చివస్తాను. ఈ లోపులో విస్తళ్ళు అవీ వేసివుంచండి' అన్నాను.

వేడివేడి పాలగ్లాసు తీసుకొని విడిదిలోకి పరుగెట్టేను.

పాలు ముసలాయనకి చూపించి 'ఇదుగో పాలు తెచ్చాను, సరేనా? ఇక మీరంతా భోజనానికి లేవాలి మరి' అన్నాను. ముసలాయన భార్య ఆయనమీంచి తనచేయి తీసేసింది.

'అయినా మామ్మగారూ? ఇంత వయు

సులో ఆలస్యంగా భోంచేస్తే ఆరోగ్యం పాడవదూ? మీకొకూడా ఇంత పట్టుదలయితే ఎలాగండి?' అన్నాను ఆవిడ్ని చూస్తూ.

'ఏదో నాయనా! ముందే నువ్వు వచ్చుంటే ఇంత గొడవ జరక్కపోను' అంది.

అందరూ భోజనానికి లేచారు.

'అన్నట్టు మామ్మగారూ? పాలు ఎవరికివ్వాలో చెప్పండి, స్వయంగా నేనిస్తాను... మీరుమాత్రం భోజనానికి ఆలస్యం చేయకండి మరి.' అన్నాను.

మామ్మగారు అటూఇటూ చూసింది. ఆడవాళ్ళు, మొగవాళ్ళు, పిల్లలు, పిల్లలూ పెళ్ళికొడుకు, చాలామందివున్నారు. ఏమనిషో తెలీలేదు నాకు. ఆవిడా వెతుకుతూనే వుంది.

'ఎటుపోయిందది ఇది... వ్వూ.' అని విసుక్కుంది.

'సరే, వెతుక్కుంటూ మీరు పదండి' అన్నాను.

ఆకలిమీద వున్నారేమో ఎవరికి వాళ్ళు పరుగెట్టారు. పిల్లల్ని అందరికంటే ముందు పరుగెట్టారు.

విడిదంతా ఖాళీ అయింది దాదాపు. పాలు ఎవరికివ్వాలబ్బా అనుకుంటూ ఆగదీ ఈ గదీ చూసేను.

పాలు చంటిపిల్లకయితే ఈపాటికి గుక్కపెట్టి ఏడుస్తూ వుండాలికదా, ఎవరూ ఏడవరేం?

దొడ్లోకి తొంగిచూసాను. నూతిదగ్గరగా చంటిపిల్లనెత్తుకొని నుంచున్నారెవరో ఆమెతో మా పిన్నికూతురు రెండోది మాట్లాడుతోంది.

దగ్గరగా వెళ్ళి 'ఏమండీ మీరేనా పాపకి పాలుకావాలంది?' అన్నాను, గ్లాసు చేత్తో పట్టుకొని.

ఆమె వెనక్కి తిరిగి చూసింది.

ఒక్కసారే ఆశ్చర్యపోయి 'హా! నువ్వా!?' అన్నాను.

'హా! నీ గురింపే అడుగుతున్నా' నవ్వి అంది మాధవి. నేను ఆశ్చర్యంలోంచి తేరుకోలేదు.

'ఏమిటలా ఆశ్చర్యపోతావు ?' అంది మళ్ళా.

'బావున్నావా' అడిగాను.

'బాగున్నావుగా!'

'అయితే బాగానే వున్నాను ... ఈ పాప

## నీకూ ఓ కథ వుందా ?

మీ పాపేనా ? నెంబర్ వన్నా, టూనా, త్రీయా?' అడిగాను.

'ఆపాప! నెంబర్ వన్నే!' అంది నవ్వుతూ.

'మీ ఆయనేడి?' అడిగా.

'రాలేదు. ఒక్కత్తినే వచ్చా!'

'చేతిలో ఏవిట్రా అది?' పిన్నికూతురు అడిగింది.

'పాలు, ఇక్కడెవరికో కావాలన్నారటగా పాపకి,' అన్నాను.

'మళ్ళా ఎవరడిగారు ?' మాధవి అంది.

'మళ్ళా ఎవరూ అడగలేదు. మొదట అడిగిందే... ఇప్పుడు తెస్తున్నా... దాన్ని గురించి మీ పెళ్ళికొడుకు వాళ్ళు ఎంత గొడవ చేశారనీ?...'

'గొడవేమిటి!?' ఆశ్చర్యంగా అడిగింది.

'హారి! నీకింకా తెలీలేదా?... ఎవరో చంటిపిల్లకి పాలు కావాలి ... కాస్త పాలు తెప్పించి యివ్వరండీ అని అడిగారట. మా వాళ్ళు ఇవ్వలేదట— పనుల్లోపడి. దాంతో 'హాఁ ... మేం భోజనానికి రాం' అని కూర్చున్నారు. వాళ్ళని బతిమలాడి, నచ్చజెప్పి భోజనానికి లేవదీసి పాలుపట్టుకొని వచ్చేను...'

మాధవి నవ్వింది. బాగా నవ్వింది. నాకు చాలా సంతోషంవేసింది—అలా నవ్వుతుంటే. మళ్ళా అలాంటి సమయం జీవితంలో వస్తుందో రాదోగానీ, భలే హాయి అనిపించింది. మాధవి చంకలోని పాప పెద్దకళ్ళతో అటూ ఇటూ చూస్తోంది.

పిన్నికూతురు 'నవ్వి భలేవాడివిరా అన్నయ్యా! మాధవే పాలు అడిగింది. నేవెంటనే తెప్పించిచ్చాను ... అసలు గొడవెందుకు జరిగిందో...' అంది.

ఆశ్చర్యపోయాను. 'ఇంత గొడవెందుకు అయిందీ మరి? పాలు అడిగింది నువ్వేనా... దీన్నే అడిగావా?' మాధవిని అడిగాను పిన్నికూతుర్ని చూపించి.

'అవును పాలు తెస్తాను అని వెళ్ళింది. అయిదు నిముషాలవరకూ రాకపోతే నేను మా చిన్నత్తయ్యగారితో చెప్పి, ఎవరినన్నా పంపించమన్నా. మరో రెండునిముషాలకే పాలు తెచ్చింది మీ చెల్లెలు' అంది

'సరే, పాలు అడిగావు, ఇదీ తెచ్చింది. బాగానే వుంది. కాని అక్కడ పాలు అడిగినట్టు మీ వాళ్ళు, పంపలేకపోయ్యాం, పొరపాటయిందీ అని మా వాళ్ళు కాసేపు గొడవపడ్డారు ... మీకేం తెలీలేదుగావును' అన్నాను.

'ఊహూఁ—ఇద్దరం మాటల్లో పడ్డాం— అందునా నీ గురించి' నవ్వింది మాధవి.

అప్పుడే ముసలావిడ ఎవరో ఇటుకేసి వచ్చింది.

'ఇదో భోజనానికి వస్తున్నా, పదండి' అంది మాధవి వెళ్ళిపోతూ.

నేనూ అక్కడ్నుంచి కదిలి, పెళ్ళి పందిట్లో వడ్డన ప్రారంభించాను నా రెండు వరసల్లో ఆడవాళ్ళూ, రెండు వరసల్లో మొగాళ్ళు కూర్చున్నారు. మాధవి కూర్చున్న వరసలోకి వెళ్ళి వడ్డిద్దామనుకున్నాగానీ, మరీ బయటపడ్డట్టు అవుతుందేమోనని వూరుకున్నాను. మనసు మాధవివేపే లాగుతున్నావడ్డన కానిచ్చేశాను మిగతా వరసల్లో.

భోజనాలు ముగిసేసరికి మూడయింది మధ్యాహ్నం. మాధవి మా(పిన్ని)ఇంట్లోనే వుండిపోయింది, భోంచేసినతర్వాత. పెళ్ళికొడుకు జనమంతా ముసలమ్మతోసహా విడిదికిచేరి గుర్రుపెట్టి పడుకున్నారు.

బయట ఎండ ఎక్కువగా వుంది. నాకు మహా అలసటగా వుంది. ఒక్కసారి ఉలిక్కిపడ్డాను. మా కేటు ఏవయినట్టు? గబగబా రెండుమూడుగదులు చూసాను. వో గదిలో మంచంమీద పడుకొనివున్నాడు. ఆ మంచంమీదే మాధవి వాళ్ళ పాపని పడుకోబెట్టి నిద్రబుచ్చుతూ మా పిన్ని, చెల్లెళ్ళతో మాటాడుతోంది.

మాట్లాడ్డానికి ఇది సమయం కాదని వెనక్కితిరిగి వో మడతమంచంమీద ఒరిగాను.

అలా పడుకున్నానో లేదో పిళ్ళ టులపెటెగ లేపేశారు. 'లేలే! నాలుగయింది. పెళ్ళికొడుకు వాళ్ళకి టిఫిన్ కాఫీ దగ్గరుండి చూడు. నువ్వయితే మాట రానివ్వవు' అన్నారు బాబాయి.

లేచి నూతిదగ్గరకెళ్ళి మొహం కడుక్కున్నాను. మొహం తుడుచుకోడానికి లోపలికొచ్చాను. మాధవి టవలందించింది. (ఎవరూ చూడలేదు నయం) గభాల్న టవలందుకొని మొహం తుడుచుకున్నాను.

పెళ్ళి తొమ్మిదింటికి. మండపం తయారు చేసి తీసుకొచ్చి పందిరికింద పెట్టారు.

అందరూ పందిరికింద కూర్చున్నారు. ముహూర్తంవేళ కావస్తోంది. అంతా ఉక్క పోసి విసుక్కుంటున్నారు. వెంటనే రెడీగా వున్న ఓ యాభై విసనకర్రలు పంచాను.

విసనకర్రలు వూగడం మొదలెట్టాయి స్పీడుగా. సన్నాయిమేళం స్థాయి నందుకుంది. మైకువాడు రికార్డులువేయడం ఎప్పుడో ఆపేసాడు— నేను చెప్పడం మూలాన.

ఆరంజిలాంటి డ్రింకు తయారు చేయించారు బాబాయి. పెళ్ళి జరుగుతుండగా అందరికీ గ్లాసులో ఇచ్చారు. ఎండాకాలంగదా, గబగబా తాగేసారు ఇవ్వడంతోటే.

చిన్నపిల్లలంతా ఒకచోటజేరి విసనకర్రలతో ఆడుకోడం, కొందరు కొట్టుకోవడం మొదలెట్టారు.

సన్నాయి, మద్దెల... పురోహితులవారి మంత్రోచ్చారణా, పెళ్ళికొడుకూ, పెళ్ళికూతురు పురోహితులవారు చెప్పినవన్నీ చేయడం చకచకా జరిగిపోతున్నాయి.

పురోహితులవారు దంపతులని అరుంధతీ నక్షత్రం చూడమన్నారు ఆకాశంకేసి చూపిస్తూ. అప్పుడే నేను మాధవికోసం చూసాను, కానీ కనపడ్లేదు.

భోజనాలు అయ్యాయి. టైం పదకొండు దాటింది. పెళ్ళికొడుకు జనాభా విడిదికి



చేరారు.

మాలతి బాగా అలసిపోయింది గావును, వంటిదాన్ని పక్కలోవేసుకొని పడుకుంది.

నాకు భోజనం సయించలేదు. పిన్ని బాబాయి మిగతావాళ్ళు ఏవేవో సర్దుతున్నారు. బట్టలు మార్చుకుందామని నా సూటుకేసు అవి పెట్టిన గదిలోకెళ్ళాను. మా కేటు మంచంమీద పడుకొనివున్నాడు. వాడు మధ్యాహ్నంనుంచి పడుకునేవున్నాడో లేక మధ్యలో లేచి మళ్ళా పడుకున్నాడో తెలీలేదు.

ఆ గదిలో మాధవివుంది! నన్ను చూడగానే నవ్వింది. బట్టలు మార్చుకుందామని వెళ్ళినవాడ్ని మావాడు పడుకున్న మంచం మీద కూర్చుండిపోయాను. మాధవికింద చాపవేసుకొని తన తొడమీద వాళ్ళపాపని పడుకోబెట్టి నిద్రబుచ్చుతోంది.

'భోంచేయలేదుకదూ?' అడిగాను.

'లేదు...ఆకలేయలేదు!'

'నాకూ అంతే!' నవ్వాను.

'నిన్ను చూడగానే నా కడుపు నిండిపోయింది' అంది. ఆ మాటలో, తమాషా, బాధ, ప్రేమ వున్నాయని నాకు తెలుసు.

'ఇప్పుడెక్కడ? జంషెడ్‌పూర్‌లో వుంటున్నారటగా!' అన్నాను.

'అవును.'

'చాలా మారిపోయావు మాధవీ!'

'నువ్వూ మారావుగా!'

'ఏవిటా మార్పు?'

'నా మార్పేవిటో చెప్పు!'

'మనం విడిపోయిన కొద్ది నీకెక్కడో లేదనుకుంటూ. నిజం చెప్పాలంటే ఇంతకుముందుకన్నా, నువ్వు అందంగా ఆరోగ్యంగా వున్నావు.'

'నువ్వూ అంతే! నేనూ అదే చెబుదామనుకుంటున్నాను.'

'నీ పెళ్ళి నిశ్చయమైనరోజు... ఇద్దరం కళ్ళనీళ్ళు పెట్టుకున్నాం గుర్తుందా? దగ్గరిదానివి అయికూడా నిన్ను దగ్గరికి తీసుకొని నాదాన్నిగా చేసుకోలేకపోయాను. అప్పుడెంత పిరికో! ఒకవేళ నువ్వు మీ నాన్నతో నేను మా నాన్నతో మాట మాత్రం చెబితే మనపెళ్ళి జరిగేదేమో అనిపిస్తుంది ఇప్పుడు...'

'సరేలే! మనం అనుకున్నట్టు జరగలేదు. ఇంకా అవన్నీ అనుకోడం దేనికి.'

'అందులోనే ఆనందంవుంది మాధవీ! నీ పెళ్ళిఅయినతర్వాత నాకు ఉద్యోగం వచ్చింది. తర్వాత పెళ్ళిచేసుకున్నాను. నువ్వురాలేదు నా పెళ్ళికి. అంతదూరం నుంచి రావాలన్నా కష్టమే అనుకో, మళ్ళా జీవితంలో ఎప్పుడు కలుస్తామో? ఏకాంతంగా మాట్లాడుకోగలుగుతామా అనిపించేది.'

మాధవి వింటూ కూర్చుంది.

'చిన్నప్పుడు జ్ఞాపకముందా, నీకంటే నేను నాలుగేళ్ళు పెద్దయినా నువ్వుకేటువి అప్పుడు. 'కానిస్తే ముక్కానిస్తా' అనేదానివి. నేను నిజమేగాబోసు అనుకొని 'కాని' యిస్తే నువ్వు మూడుకానులు బదులు ముక్కానిచ్చేదానివి. పెరిగి పెద్దయిన తర్వాతకూడా అడిగాను 'కానికాదు, పదిరూపాయలిస్తా, ముక్కానిస్తావా' అని, 'అబ్బ! ఆశ! పాపం' అనేదానివి. మధ్యలో నయాపైసలువచ్చి చెడగొట్టేసాయి కానీ, ఎప్పుడో ముక్కానింపజేసేవాడ్ని.'

మాధవి తలొంచుకుంది.

'ఏం మాధవీ?'

మాధవి పలకలేదు.

చంటిపిల్లమీద కన్నీళ్ళు టపటపమని పడ్డాయి.

'మాధవీ!' దిగ్గునలేచి దగ్గరికెళ్ళాను,

మా ఆవిడ నన్ను విడిచి ఒక్క క్షణం కూడా వుండలేదు – నాతో పాటే ఇక్కడ వుండనివ్వండి!



'ఛ! ఏడుస్తున్నావా?' అన్నాను. ఏడుస్తోందని తెలిసికూడా.

కొంగుతో కళ్ళనీళ్ళు తుడుచుకుంది.

'ఏడవకు మాధవి! నవ్వుతూ మాట్లాడు. మన జీవితంలో మళ్ళా యిలా కలుస్తామో లేదో, ఏదేనా మాట్లాడు మాధవి... వింటాను. అదే జీవితాంతం గుర్తుంచుకుంటాను...నీ పెళ్ళి నా పెళ్ళి అయింది. మీ ఆయన సంగతి నాకు తెలీదుగానీ, మాలతి చాలా మంచిది. మన స్నేహం గురించి, మన భగ్నహృదయాల గురించి నా పెళ్ళి అయింతర్వాత మర్చిపోయాను— అలా అన్నీ మరపింపజేసింది మాలతి, నిజం చెప్పాలంటే నువ్వూ అంతేకదూ ?'

మాధవి నవ్వింది. 'పెళ్ళయితే అంతే... ఎవరి గొడవల్లో వాళ్ళు, ఎవరి సంసారాల్లో వాళ్ళు పడిపోతారు, సహజం. కానీ, ఎందుకనో నిన్ను చూడగానే పాతదంతా జ్ఞాపకమొచ్చి దుఃఖం వస్తోంది. నవ్విన మాధవి కంఠం మళ్ళా మారింది.

'నాకూ అంతే! నువు ఒకరి భార్యవు. నేనొకరి భర్తను. ఇద్దరం ఈ గదిలో, నీ పాపతో, నా బాబుతో వున్నాం. చాలా గమ్మత్తుగావుంది కదూ? ఈ సమయం ఎందుకో నాకు చాలా విలువైందిగా కనిపిస్తోంది ఇలాంటి అదృష్టం ఎంత మంది పాతస్నేహితులకి, పోనీ ప్రేమికులకి వస్తుందంటావు? నువ్వూ నేనూ పెళ్ళి చేసుకొని ఓ గదిలో మన పిల్లలతోవుంటే ఇలాంటి సమయం, విలువయినదనీ, అదృష్టమనీ అనుకునేవాళ్ళం కాదుకదూ ?!

మాధవి అంది 'నీకొకటి చెప్పనా' ఒసారి మావారు అడిగారు, మాధవీ! నువ్వు ఎవరినైనా ప్రేమించావా ఇంతకుముందు అని.'

'ఏం చెప్పావు' ఆదుర్దాగా అడిగాను,

'లేదని చెప్పాను.'

ఎందుకో ఆ జవాబు నాకు బాధనిపించింది.

'ఆయన చాలా మంచివారు. ఒక్కటీ దాచరూ. తనూ ఓ అమ్మాయిని ప్రేమించారట...అంతా చెప్పారు'

'అలాంటప్పుడూ నువ్వూ చెప్పక పోయావా?' నవ్వాను.

'చెబుదామనుకున్నాగానీ, తీరా చెప్తే ఆయనకి అనుమానం, అసూయ పుట్టు


ఇదుగో! నోటికంతా రక్షణ చేకూర్చే

టూత్ పేస్ట్ – నీమ్

నీమ్ టూత్ పేస్ట్ మీ పళ్ళను శుభ్రపరచడమే గాదు, నీమ్ టూత్ పేస్ట్‌లో ఆరోగ్య ప్రదాయిని వేప (నీమ్)కు వుండే అద్భుత లక్షణాలన్నీ వున్నాయి. పళ్ళను గట్టిపరిచి చిగుళ్ళకు రక్షణ చేకూర్చి, దుర్వాసనను నివారించి, మీ నోటిని సర్వదా స్వచ్ఛంగా వుంచుతుంది.




కలకత్తా కెమికల్‌వారి ఉత్పత్తి

కొన్సే? మగాళ్ళని ఎవరు నమ్మేరు?... అందుకని నాకు ప్రేమాగీమా అనేవి తెలియవన్నా.'

'సర్లే చెప్పకు!' అన్నాను.

'మావారిని చూస్తుంటే ప్రతివాళ్లకీ ఏదో కథ వుంటుందనిపిస్తోంది. ప్రతి ఒక్కళ్లూ ఎవర్నో ఒకర్ని ప్రేమించ

## నీకూ ఓ కథ వుందా?

డమో, దూరంగా వుండి ఆరాధించడమో చేస్తుంటారు. పెళ్లినాటికిముందే హృదయం ఎవరితోనో నిండిపోతుంది. నిజంగానో, వూహలతోనో. కానీ ఎవరూ అనుకున్న విధంగా ప్రేమించినవాళ్లని పెళ్లిచేసుకో లేదు...' మాధవి చెప్తోంది:

అలా చాలాసేపు కూర్చుని మాట్లాడాం. మా పిన్నివాళ్లు గాబట్టి మమ్మల్ని అంతగా పట్టించుకోలేదు. ఎందుకంటే మాధవీ, నేను చిన్నప్పట్నించి కలిసివున్నామని తెలుసు.

పెళ్లి హడావుడి అయిపోయింది. మాధవి పెళ్లి అయినప్పుడు ఎంతబాధ పడ్డానో ఇప్పుడూ అంతే బాధపడ్డాను.

'అచ్చు నీ పోలికే!' అంటూ మా కేటుని ముద్దెట్టుకుంది మాధవి, వెళ్లే ముందు.

ఆ ప్రేమముద్దు నాకే అని తెలుసు.

సామానులు సర్దుకుని నేనూ మాలతీ పిల్లలో బెజవాడనుంచి బయలుదేరాం.

* * *

ఇంటికి చేరగానే ఆర్రాత్రి మాలతిని వున్నట్టుండి అడిగేను! 'మాలతీ! ఇంతకు మునుపు నువ్వు ఎవరినన్నా ప్రేమించేవా?'

బిత్తరపోయింది మనిషి.

'ఏమిటండీ, ఏవిటిలా మాట్లాడు తున్నారు' అదోలా చూసింది మొహంలోకి.

'నిజమేను మాలతి! భయపడక. నిజం చెప్తే అతన్ని పిలిపిస్తాను— సరదాగా మాట్లాడుకోవచ్చు.'

మాలతి ఒక్కసారిగా ఏడ్చేసింది.

'మాలతీ! మాలతీ! ... ఎందుకేడుస్తున్నావు?' గడ్డం పట్టుకొని అడిగేను.

'లేపోతే ఏవిటండి యిదీ?...నాకేం తెలీదు..నేనెవర్నీ యింతకుముందు ప్రేమించ లేదు...నన్ను నమ్మండి' అంటూ గుండెల మీదపడి ఏడ్చింది.

'ఛ! వూర్కో మాలతీ!'

'మరి అలా అడగనని, అడిగి బాధ పెట్టనని ఒట్టేయండి' అంది.

ఒట్టేశాను. మాలతి మొహంలోకి చూసాను.

'నన్ను నమ్మరా!' అంది గుండెలమీద వాలిపోయి మళ్లా. ఏడుపు ఆపలేదు.

మాధవి మాటలు గుర్తుకొచ్చేయి 'మగాళ్ళని ఎవరు నమ్మేరు...'

నిజమే. ఈ విశాలహృదయం కథ విననంతవరకే. విన్నతర్వాత ఈ హృదయం బ్రద్దలుకాకుండా విశాలంగా వుంటుందా?

ఏమైనా మాలతిని ఇంకెప్పుడూ అలా అడగకూడదనుకున్నాను. ●

---

పళ్లు—గుణాలు

## మామిడి పండు

మామిడి పళ్ళలో దేశవాళీ మామిడి పళ్ళు అంటుమామిడి పళ్ళు అని రెండురకాలు. ఇక ఈ రెండు రకాలలోను మళ్ళీ అనేక రకాల మామిడిపళ్ళు ఉన్నాయి.

సాధారణంగా తియ్యగా పల్చగా వుండే మామిడి పళ్ళ రసం వేడిచేసి ఆర్చుతుంది. వాతాన్ని హరిస్తుంది. క్రొవ్వుని పెంచుతుంది. వీర్యానికి వేడినిచ్చి వీర్యవృద్ధి గావిస్తుంది. అరుచిని పోగొడుతుంది. కిడ్నీస్‌కు, హృదయానికి, మెదడుకి, రొమ్ముకి, మూత్రపు సంచికి బలాన్ని యిస్తుంది.

గుండెలోని వికారాన్ని, దగ్గుని, తలనొప్పిని, నీరసాన్ని పోగొడుతుంది. శరీరానికి మంచి బలాన్ని చేకూరుస్తుంది. పొట్టను మృదువు పరుస్తుంది.

పుల్లగా ఉండే మామిడిపళ్ళ రసం మిక్కిలి వేడి చేస్తుంది. శరీరానికి అంత మంచిదికాదు. అపథ్యమయినది.

మామిడిపళ్ళ రసం శరీరానికి ఎంత మేలు చేస్తుందో— అధికంగా తింటే అంత అపకారం కూడా చేస్తుంది. ఇదికాక పైత్యం చేస్తుంది. గురుత్వంగా ఉంటుంది. కడుపు బిగబడుతుంది. ఒక్కొక్కప్పుడు కడుపు పొంగవచ్చు. వాత పైత్యం, కామిల, పాండువు, ఆమరోగాలు, కఫోద్రేకం, వీనినికలుగజేస్తుంది. వాత శ్లేష్మతత్వాలు గలవారికి, ద్వంద్వ రోగులకు ఇది మిక్కిలి అపథ్యమయినది.

ఈ పండు యొక్క దుర్గుణాలకు విరుగుళ్లు :— 1. నెయ్యి 2. పాలు 3. శొంఠి 4. శొంఠి, పిప్పలి, మిరియాలు ఈ మూడింటి చూర్ణం. 5. ఉప్పు 6. మజ్జిగ 7. ఏలకిగింజల చూర్ణం 8. సైంధవలవణం.

మామిడి టెంక వీర్యవృద్ధి, దేహపుష్టి, శక్తి నిస్తుంది. పైత్యాన్ని, శ్రమను, అరుచిని పోగొడుతుంది.

మూలవ్యాధి, విసర్పి, గ్రహణి, శ్వాసకాస, నేత్ర రోగం, వాతరోగం, రక్తపైత్యం ఈ రోగాలు కలవారు— రసమిశ్రితమైన ఔషధం సేవిస్తున్నవారు మామిడికాయ, దీనిపచ్చడి, ఊరగాయ తినడం మంచిదికాదు.

### దానిమ్మపండు

తియ్యని దానిమ్మపండు మన శరీరానికి చాలా మేలు చేస్తుంది. ప్రతిదినం భోజనానంతరం ఒక దానిమ్మపండు తిన్నట్లయితే, తినిన పదార్థాలు బాగా జీర్ణమవుతాయి. ఈ పండు చలవచేసి నీరును పెంచుతుంది, మంచి దేహపుష్టినిస్తుంది. రక్తాన్ని వృద్ధి పొందిస్తుంది. ఉష్ణతత్వం గల వారి పుంస్త్వమును హెచ్చిస్తుంది. శరీరానికి మంచి కాంతి నిస్తుంది. హృదయానికి బలాన్ని యిస్తుంది. అరుచిని పోగొడుతుంది. మేహాన్ని వెడలగొడుతుంది. పైత్యశాంతి చేకూరుస్తుంది. రక్తగ్రహణి, గజ్జి గల వారికి మిక్కిలి పథ్యమయినది. పొట్టకు, గుండెకు బలాన్ని యిస్తుంది. గుండెలో గల వికారాన్ని నొప్పిని తగ్గిస్తుంది. దగ్గుని హరిస్తుంది. కంఠస్వరాన్ని బాగు చేసేటందుకు తోడ్పడుతుంది. అమితంగా తింటే వాతరోగం రావచ్చును.

తియ్య దానిమ్మపండు యొక్క దుర్గుణాలకు విరుగుళ్ళు :—1. పొగడ పండు 2. ఉష్ణ శరీరులకు పుల్ల దానిమ్మపండు 3. చలవ శరీరులకు అల్లం మురబ్బా.

పుల్ల దానిమ్మపండు మొదట చలవచేసి ఆ తరువాత వేడి చేస్తుంది. పొత్తి కడుపుకు బలాన్ని యిస్తుంది. రక్తపైత్యాన్ని హరిస్తుంది. మేహశాంతి చేకూరుస్తుంది. రక్తాతిసారాన్ని పోగొడుతుంది. పుల్లని దానిమ్మపండు ఉష్ణతత్వం గలవారికి అనుకూలమైనది. అధికంగా తింటే గుండెకు నష్టాన్ని కలుగజేస్తుంది. వీర్యనష్టం కలుగజేస్తుంది.

పుల్లదానిమ్మ పండు యొక్క దుర్గుణాలకు విరుగుళ్ళు:— 1. పొగడపండు 2. శొంఠి పొడి వేసిన తియ్యదానిమ్మపండు రసం.

**సేకరణ: ఆకుండి నారాయణమూర్తి**